# చిన్నమ్మ నవ్వింది

"ఒరే బుజ్జిగా! ఎన్నిసార్లు పిలవాలిరా? అన్నానికి రా ! ఆ జెష్టను కూడా రమ్మను మింగటానికి! అన్నది చుక్కమ్మ లోపలి నుంచి పెద్దగా.

బుజ్జిగాడు పుస్తకం మూసి లేచాడు. చొక్కా చివరతో ముక్కు తుడుచుకున్నాడు. వెనుదిరిగి గుమ్మంలో కూర్చుని వున్న అక్క వైపు చూశాడు.

పన్నెండేళ్ళ చిన్నమ్మ కదలకుండా కూర్చుని ఉంది. పక్కనే కర్ర. ఆమె పిన్నమ్మ మాటలు విన్నది. అయినా లేవలేదు. ఆమె కళ్ళల్లో నీళ్ళు నిలబడుతున్నాయి.

బుజ్జిగాడు నెమ్మదిగా - "అక్కా అమ్మ రమ్మంటున్నది అన్నానికి!" అన్నాడు.

చిన్నమ్మ వాడి వైపు చూసింది కాని కదలలేదు.

రెండు భాగాలుగా చిన్న పాక. పడమటి పక్కన రెండడుగుల ఖాళీ స్థలం. చివర దడి. సూర్యుడు నడినెత్తిమీదకి వచ్చాడు. ఎండ మాడ్చేస్తున్నది. వేడి గాలి విసురుగా వీస్తున్నది. చిన్నమ్మకు ఆకలి అవుతున్నది కాని లేవలేదు.

బుజ్జిగాడు అక్క దగ్గరికి వచ్చి, 'రా, అక్కా! అన్నం తిందాం" అన్నాడు. మళ్ళీ.

చిన్నమ్మకు మనస్సు బాగాలేదు. అప్పుడే కాదు, ఈ మధ్య కొద్ది రోజులనుంచి అంతే. సంక్రాంతి పండుగ వెళ్ళిన దగ్గరనుంచి అంతే. అంతకుముందు మనసు బాగుండేది. సవతి తల్లి ఇలా కసురుకునేది కాదు. ఆ సంక్రాంతి పండుగతో తన రోజువారీ సంపాదనకు మద్యనిషేధం పుణ్యమా అని తెర పడింది.

లోపలి నుంచి మళ్లీ చుక్కమ్మ పెద్దగా-"ఏరా! ఏమైంది మీకు? రారేం?" అని అరిచింది.

బుజ్జిగాడు భయంతో కదిలాడు. చిన్నమ్మ కూడా దేకుతూ వచ్చింది.

చుక్కమ్మ కోపంతో-"ఏం? ఎన్నిసార్లు పిలవాలి?" అని గర్జించింది. సత్తుపళ్ళెంలో ఉన్న రెండు ముద్దలు గబగబా తిని ఇవతలికి వచ్చింది చిన్నమ్మ.

దేకుతూ వెళ్ళి చాపమీద కళ్ళు మూసుకుని ముడుచుకుని పడుకుంది.

వెంకటయ్య రిక్షా వేసేందుకు వెళ్ళిపోయాడు ఉదయమే. ఇహనో ఇప్పుడో వచ్చి కాస్త ఎంగిలిపడి మళ్ళీ రిక్షా తీసుకుని ఊరిమీదికిపోతాడు. ఇక ఏకంగా రాత్రికి రిక్షా యజమానికి అప్పజెప్పి రావడమే. చుక్కమ్మ ఆ చుట్టు పక్కల నలుగురైదుగురు ధనికుల ఇళ్ళల్లో చాకిరీ చేసి వేణ్ణీళ్ళకు చన్నీళ్ళుగా కొంత సంపాదిస్తూ ఉంటుంది. బుజ్జిగాడు వీధి చివర మునిసిపల్ స్కూల్లో రెండో క్లాసు చదువుతున్నాడు. వాణ్ణి మొగుడూ పెళ్ళాలిద్దరు అపురూపంగా, అతి గారాబంగా చూసుకుంటారు. చిన్నమ్మ వెంకటయ్యకు మొదటి భార్య సంతానం. చిన్నప్పుడే కాళ్ళు రెండూ పోయి అవిటిదై ఉండిపోయింది. కళకళలాడే చామనచాయ ముఖం, చక్కని కనుముక్కు తీరు. కాని అవిటిదై అందరికి భారమైపోయింది. రెండేళ్ళ క్రితం వరకు చిన్నమ్మ ఇంట్లోనే అటూ ఇటూ దేకుతూ ఏమీ తోచక, ఎవరూ

మాట్లాడే వారులేక, సవతి తల్లి మాటలు భరించలేక బాధపడుతూ ఉండేది. కాని ఒకప్పుడు అప్పట్లో ఆ పిల్ల అదృష్టం కొద్దీ ఆ వీధిలో ఉండే ఒక మాస్టారు ఒక ఉపాయం చెప్పారు.

కాస్త దూరంలో మెయిన్ రోడ్డు. రోడ్డు మీద ఒక వైన్ షాపు కమ్ బార్. ద్రవాన్ని విడిగా రెండు మూడు రెట్లు భారీ ఖరీదు చెల్లించి ఖరీదైన బార్లలో తాపీగా కూర్చుని సేవించే భాగ్యం లేని మామూలు మనుషులు ఆ షాపుకు విస్తారంగానే వస్తూ ఉండేవారు. లోపల గోడవారగా గుండెల ఎత్తున బల్లలు, మధ్య మధ్య స్టూల్సు, నిక్షేపంగా మామూలు రేట్లకే మందుకొట్టే సదుపాయం. ఆ మాస్టారి సలహామేరకు ఆ షాపు ముందు మెట్లమీద చేరిందీ చిన్నమ్మ. ఎదురుగా ఎత్తు పీట మీద జర్మన్ సిల్వర్ బొచ్చెలో ఉడికించిన బఠాణీలు. వాటిని తినేందుకు వీలుగా స్పూన్‌లుగా పనికొచ్చే ఎండుటాకులు పెట్టుకుని బిచాణా పరిచింది. లోపల సర్వర్ కుర్రవాళ్ళకు చిన్నమ్మ అంటే జాలి – అవిటిపిల్ల అని. వాళ్ళు లోపల మందుకొట్టే మందు బాబులకు నంజుడుకు ఈ బఠాణీలు తీసుకుపోయి అందించేవారు. ఇదంతా చుక్కమ్మ అనుమతితోనే జరిగింది.

చిన్నమ్మ ఆ రోజుల్లో సాయంకాలం అయ్యేసరికి మొహం కడుక్కుని జుట్టు దువ్వుకుని తయారయ్యేది. మధ్యాహ్నమే సిద్ధము చేసిఉంచిన బఠాణీల బొచ్చెతో బుజ్జిగాడు వెంటరాగా కర్ర ఊతంతో రోడ్డు దాటి వైన్ షాపు ముందు మెట్లమీద ఒకేచోట స్థిరపడేది.

క్రమంగా పగలు అంతరించి చీకటి పడేసరికి ఒక్కొక్కరుగా, ఇద్దరిద్దరిగా, ముగ్గురు ముగ్గురుగా రకరకాల జనం మెట్లెక్కి లోపలికి వెళ్ళేవారు. పగటి బాధలు మరిచిపోయేందుకేమో దాహంగొన్నవారిలా ఎగబడేవారు. లోపల గోడవారగా బల్లలు నిలబడి అర్జెంట్‌గా మద్య సేవనం చేసే తొందర మనుషులకు. ఆ బాపతువారికి అన్నీ అర్జంటే. ఎక్కువసేపు ఉండలేరు. నిలకడ ఉండదు. సర్వర్ సీసా తెచ్చి ఇవ్వగానే మూతతీసేస్తూ “నీళ్ళు నీళ్ళు అని అరుస్తారు. నీళ్ళు రాగానే గబగబా ద్రవాన్ని గ్లాసులోకి వంపుకుని నీళ్ళు కలుపుకుని అంత అర్జంటుగానూ గొంతులో పోసుకుని, మళ్ళీ రెండోసారి అంత తొందరగానూ నీళ్ళు, ద్రవం కలుపుకుని గటగటమింగి ఏ సిగరెట్లో కాల్చుకుంటూ వెళ్ళిపోయేవారు ఒక బాపతు. వీళ్ళ వల్ల షాపువాడికి తప్ప చిన్నమ్మకు ఏమీ లాభం లేదు. అలాకాక, జంటలుగా వచ్చి కాసిని కబుర్లతో స్టూల్స్ మీద కూర్చుని నింపాదిగా మధుపానం చేస్తూ అంత నింపాదిగానూ ధూమపానం చేస్తూ మధ్య మధ్య నంజుడుకు బఠాణీలు తెప్పించుకుని, మందు చాలక, మళ్ళీ తెప్పించుకుని, బఠాణీలు చాలక మళ్ళీ తెప్పించుకుని కబుర్లు తెమలక నింపాదిగా ‘అనుభవించేవారు’ కొందరు. వీళ్ళవల్ల షాపువాడికీ, బఠాణీల చిన్నమ్మకు కూడా లాభమే. ఇలా రాత్రి పొద్దుపోయేవరకూ, పదకొండు గంటల వరకు సాగేది వ్యాపారం. అప్పుడప్పుడు చిన్నమ్మ ఆశ్చర్యపోయేది. చిన్న సీసా యాభై, అరవై రూపాయిలు పెట్టి ఎలా తాగగలుగుతున్నారు వీళ్ళు? అంత డబ్బు వీళ్ళ కెక్కడిది? అసలెందుకు తాగడం? వీళ్ళు ఏంచేసి ఇంత డబ్బు సంపాయిస్తున్నారు? ఉపన్యాసాల్లో ఎన్నికలప్పుడు ‘మనది పేద దేశమని, పేదరికాన్ని ప్రభుత్వమే పెంచి పోషించినదనీ’ అంటూంటారెందుకు?

ఖరీదైన కార్లలో తిరిగే వారికి, భారీగా డబ్బు తగలేసి వెర్రి సినిమాలు చూసే వెర్రి వెంగళప్పలకూ, పెద్ద పెద్ద భవంతులలో ఉండేవారికి అలా అనే అధికారం ఉందా? తాను ఇన్ని గంటలు కూర్చుని బఠాణీలు అమ్మితే తనకు మిగిలేది ఎంత? పదో, ఎనిమిదో. అయితే ఈ మాత్రపుదానికే చుక్కమ్మ మురిసిపోతూ, “అవిటిదయినా సంపాయించి పెడుతోంది పిల్ల” అని పక్కవారితో అంటూ ఉండేది.

అయిందా?

అదుగో ఆ జనవరి పదహారు. పండుగ తర్వాత తన దశ మారిపోయింది. శని పట్టినట్టయింది. "అంతా బంద్" అన్నారు. షాపులకు తాళాలు పడ్డాయి. మందు బాబులకు మందు తేలిగ్గా దొరక్క బాధ. తనకేమో సంపాదన పోయిందనీ, సవతితల్లి ధోరణీ మారిపోయిందనీ బాధ.

ఆనాడు ఎప్పుడో బతాణీల ఉపాయం చూపించిన మాష్టారు ఇవ్వాళ మళ్ళీ రోడ్డుమీద వెళ్తూ చిన్నమ్మను పలకరించాడు–"ఎలా ఉన్నావు" అని అడిగాడు.

చిన్నమ్మకు కళ్ళ నీళ్ళ పర్యంతమైంది.

సవతితల్లి లోపల ఎక్కడో ఉన్నందువల్ల నెమ్మదిగానే అయినా సంగతంతా వివరించింది. తనకు ఇలా బతకాలని లేదన్నది. చచ్చిపోతే మేలన్నది.

ఆయన నవ్వాడు. "చూద్దాం! అంతలోనే చచ్చిపోతే ఎట్లా?" అంటూ వెళ్ళిపోయాడు.

ఆ మరునాడు ఉదయమే విచిత్రం జరిగింది.

బుజ్జిగాడు బుట్టెడు పూలతో వచ్చాడు.

"మాష్టారు పిలిస్తే వెళ్ళాను. ఇవి ఇప్పించారు. మాలగా కట్టి, సాయంకాలం వెళ్ళి వంతెన పక్కన కూర్చోమన్నారు." అని చెప్పాడు.

చిన్నమ్మ పూలు ముందు పోసుకుని కూర్చుని మాలకట్టడం మొదలుపెట్టింది. సన్నటి చేతివేళ్ళు అమిత నిపుణంగా కదిలాయి. అందాల పూలమాల మూరెడెత్తున తయారయింది. దానిమీద నీళ్ళు చల్లి ఉంచింది.

చుక్కమ్మ అంతా చూస్తూనే ఉండి, మధ్యలో బుజ్జిగాణ్ణి అడిగి విషయం తెలుసుకుని లోలోపల సంతోషించింది. కాని పైకి ఏమీ అనలేదు.

సాయంకాలం ఆఫీసులు మూసేవేళ...జనం కొనుగోళ్ళకు వచ్చేవేళ. వెళ్ళి వంతెన పేవ్‌మెంట్ మీద కూర్చున్నది చిన్నమ్మ. ఎదురుగా పూలబుట్ట పెట్టుకుంది.

అటూ ఇటూ చాలామంది రకరకాల పళ్ళూ, కూరలూ అమ్ముతున్నారు. అప్పుడు లిక్కర్ షాపుముందు ఒంటరి ఒంటరిగా, ఇద్దరిద్దరుగా మనుషులు వచ్చినట్టుకాక, మరింత రద్దీ ఇక్కడ. ముఖ్యంగా ఆడ – మగ జంటలు , పిల్లా మేకతో...రకరకాల వాహనాలమీదా, నడుస్తూనూ వచ్చారు. అవిటి పిల్లను గమనించి ప్రత్యేకించి ఆగి మరీ పూలు కొన్నారు. దేవాలయాలకు వెళ్ళేవారు బేరమాడకుండా కొనుక్కుపోయారు. మొదటి సినిమా వదిలే వేళకు సరుకు ఖతమైపోయింది.

చిన్నమ్మ ఇంటికి చేరింది.

మాష్టారు వచ్చాడు. "పూలు పదిరూపాయిలు ఇవ్వు " అన్నాడు.

చిన్నమ్మ డబ్బు లెక్కపెట్టింది. ఇరవై రూపాయిలపైన కొంచెం చిల్లర వుంది".

"పది రూపాయిలు నీ సంపాదన" అన్నాడాయన పది రూపాయిలు తాను తీసుకుని.

"రోజూ బుజ్జిగాణ్ణి పంపించు. పూలు ఇప్పిస్తాను" అన్నాడాయన వెళ్ళిపోతూ.

చిన్నమ్మ డబ్బు అంతా పిన్నమ్మ చేతిలో పోసింది.

పిన్నమ్మ డబ్బు చూసుకుని నవ్వింది.

బుజ్జిగాడు నవ్వాడు.

చిన్నమ్మ కూడా నవ్వింది.

♦ ♦ ♦